క్లుప్తంగా

నేడు మండలంలో కాంగ్రెస్ రోడ్‌షోలు

కందుకూరు: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ శనివారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహించనున్న రోడ్‌షోలో పాల్గొననున్నారని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.15 గంటలకు సరస్వతిగూడలో రోడ్‌షో ప్రారంభమవుతుందన్నారు. ఆ తర్వాత లేమూరు, తిమ్మాపూర్, రాచులూరు, గూడూరు, పులిమామిడి, మధ్యాహ్నం 1.15 గంటలకు నేదునూరు గ్రామాల్లో కొనసాగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు బీజేపీ విస్తృత స్థాయి సమావేశం

కందుకూరు: బీజేపీ మండల పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని శనివారం మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఊటు మహేందర్ శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పాపయ్యగౌడ్, కడారి జంగయ్య, మిద్దె సుదర్శన్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి



కందుకూరు: అసమర్థ బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కులేదని జిల్లా గ్రంథాయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 2018 ఎన్నికల్లో రూ.1 లక్ష వరకు రుణమాఫీ హామీ ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 వరకు ఆ హామీని అమలు చేయడంలో విఫలమయిందన్నారు. ఆ పార్టీ పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పును తెలంగాణ ప్రజలపై మోపి, రాష్ట్రాన్ని దివాలా తీయించారని ఆరోపించారు. ప్రస్తుత ఎన్నికల్లో లబ్ధి పొందేలా ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ నాయకులు వెకిలి చేష్టలు చేస్తున్నారని, అందులో భాగంగానే హరీశ్‌రావు రాజీనామా అంటూ కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతారన్నారు. ప్రజలు, రైతులు ప్రతి పక్షాల మోసపూరిత మాటలను పట్టించుకోవద్దని, కాంగ్రెస్ అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా అండగా నిలవాలని ఆయన కోరారు.

శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీ దేవికి అభిషేకం, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పాలంకరణ చేశారు. ఉదయం ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, ఆలయ ప్రధాన పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

మామిడి పండ్ల దుకాణాల్లో తనిఖీలు

నాగోలు: ఇథిలీన్, కార్బైడ్ ఉపయోగించి మామిడి పండ్లకు అమ్మకాలు చేస్తున్న దుకాణాలపై ఫుడ్‌సేఫ్టీ- టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం శుక్రవారం కొత్తపేట పండ్ల మార్కెట్ ఆవరణలో తనిఖీలు చేశారు. పండ్లను రసాయాలు ఉపయోగించి మాగబెడుతున్నారన్న సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. కొత్తపేట పరిధిలో 550 కేజీల పండ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి నోటీసులు జారీచేశారు. కార్బైడ్ ఉపయోగించి పండ్లకు మాగబెట్టి అమ్మకాలు చేస్తే ఎఫ్ఎఫ్ఎస్ చట్ట ప్రకారం రూ. 2 లక్షల వరకు జరిమానా విధించబడుతుందని అధికారులు వివరించారు.

డేంజర్ సిగ్నల్!

- ప్రమాదాలకు నిలయంగా ప్రశాంతిహిల్స్ కూడలి
- వేగాన్ని కంట్రోల్ చేయలేక తరచూ సంఘటనలు
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్



స్పీడ్ బ్రేకర్లు లేక అస్తవ్యస్తంగా వస్తున్న వాహనాలు

మీర్‌పేట: ఇరుకుగా ఉన్న రహదారిని విస్తరించారు. రాకపోకలకు మార్గం సులువైంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ప్రధాన కూడళ్లలో మాత్రం వాహనాల వేగానికి కళ్లెం వేసే చర్యలు తీసుకోకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మీర్‌పేట నుంచి అల్మాస్‌గూడకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ప్రశాంతిహిల్స్ కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. అటు మీర్‌పేట నుంచి ఇటు నందిహిల్స్ నుంచి వచ్చే వాహనాలు తరచూ ప్రమాదానికి గురవుతూ పలువురు తీవ్రంగా గాయపడుతున్నారు. ప్రస్తుతం కూడలికి ఇరువైపులా రోడ్డు పెద్దగా ఉండడం, వేగాన్ని తగ్గించేందుకు కనీసం అధికారులు స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్లు కూడా ఏర్పాటు చేయలేదు.

రాకపోకలు ఎక్కువ

ఉదయం, సాయంత్రం వేళల్లో మూడు వైపులా నుంచి వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడం, దీంతో పాటు నందిహిల్స్ నుంచి రహదారి దిగువన ఉండడంతో వాహనదారులు కూడలికి రాగానే వేగాన్ని కంట్రోల్ చేయలేకపోతుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదే రహదారిలో ప్రతి సోమవారం వారాంతపు సంత కూడా నిర్వహిస్తారని, ఏదైనా పెద్ద వాహనం అదుపు తప్పితే పెద్ద ప్రమాదమే జరుగుతుందని, కావున కార్పొరేషన్ అధికారులు స్పందించి కూడలిలో స్పీడ్ బ్రేకర్లు లేదా రబ్బరు బారికేడ్లు అయినా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు



రహదారిని విస్తరించిన నాటి నుంచి ప్రశాంతి హిల్స్ కూడలిలో రోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో పాటు రాత్రి వేళల్లో హైమాస్ట్ లైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదు.

– దాసరి బాబు, ప్రశాంతిహిల్స్

కాసానిని గెలిపించాలని ప్రచారం



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మీర్‌పేట: కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ మీర్‌పేట బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత, ఉపాధ్యక్షురాలు సిద్దాల లావణ్యల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముందుగా మీర్‌పేట చౌరస్తాలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇంటింటి ప్రచారం చేశామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనను గాలికొదిలేసిందని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాల నాయకుడైన జ్ఞానేశ్వర్‌కు ప్రజలంతా మద్దతు తెలపాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో మేయర్ ఎం.దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి

మాడ్గుల: మానవ అక్రమ రవాణా నిర్మూలించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, కోఆర్డినేటర్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మహిళ శిశు సంక్షేమ శాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సూపర్ వైజర్‌లు జయమ్మ, పద్మలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. నేటి సమాజం కొత్త పద్ధతుల ద్వారా సైబర్ ట్రాఫికింగ్ జరుగుతుందన్నారు. మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ వాడుతున్న వారు ఎవరైనా దీనికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా యువతులు మొబైల్ ఫోన్‌లో రకరకాల యాప్స్ ద్వారా లైంగిక వ్యాపారానికి గురి అవుతున్నారని తెలిపారు. ప్రజ్వల సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

జాతీయవాదమే మోదీ సిద్ధాంతం

- బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- మీర్‌పేటలో ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

మీర్‌పేట: శత్రువుల నుంచి అటు దేశాన్ని, రామ మందిరం నిర్మించి ఇటు ధర్మాన్ని కాపాడుతున్న యోధుడు ప్రధాని నరేంద్రమోదీ అని బీజేపీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్‌లో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో దేశంలో విపత్తులు వస్తే ఇతర దేశాల వైపు చూసే వారమని, కానీ మోదీ ప్రభుత్వం వచ్చాక ఇతర దేశాల్లో వరదలు, విపత్తులు వస్తే భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. జాతీయవాదమే మోదీ సిద్ధాంతమన్నారు. మతం, రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. రాహుల్‌గాంధీ ముస్లింలకే ప్రతినిధి అని, దేశానికి కాదన్నారు. కాంగ్రెస్ కూటమికి ప్రధాని అభ్యర్థి ఎవరో తెలియదని, బీజేపీ మాత్రం ప్రధానిగా మోదీకే ఓటు వేయాలని గర్వంగా అడుగుతున్నామని చెప్పారు. ఈసారి ఎన్నికల్లో దక్షిణ భారతదేశంలో గతంలో కంటే ఎక్కువ స్థానాలు బీజేపీ గెలుచుకుంటుందన్నారు. రానున్న ఐదేళ్ల తరువాత రాష్ట్రంలోనూ రానున్నది బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, గోవర్ధన్‌రెడ్డి, మధు, సోమేశ్వర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం

కందుకూరు: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ముమ్మరంగా ప్రచారాన్ని చేపట్టింది. శుక్రవారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో మాదాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆదిమూలం శ్రీకాంత్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాజా ప్రతాప్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, శ్రీధర్‌ముదిరాజ్, బలరామ్, సాయిలు, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి, ఆయూబ్, కరుణాకర్‌రెడ్డి, మహేందర్, ప్రవీణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్, గఫూర్‌నగర్‌లో..

కొత్తూర్, గఫూర్‌నగర్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి బొక్క భూపాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, అజీజ్, పాండురంగారెడ్డి, వెంకటేష్, శేఖర్, మహేందర్, తిరుపతిరెడ్డి, దర్శన్, శంకరయ్య, యాదగిరి, మైసయ్య, రాజు, శ్రీను, కుమార్, ధనుంజయ్‌గౌడ్, రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



గఫూర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

గూడూరులో..

గూడూరులో టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. సులేమాన్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన రాజేందర్‌రెడ్డి, నాయకులు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని దెబ్బడగూడకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిట్టా రాజేందర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాజేందర్‌రెడ్డి బీజేపీలో చేరారు. ఆయనతో పాటు పార్టీలో చేరిన మధుసూదన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, విక్రంరెడ్డి, శ్రీశైలం, ప్రకాష్‌రెడ్డి తదితరులకు కిషన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చేవెళ్లలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భిక్షపతి, బీజేపీ నాయకులు జంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భూమిరెడ్డి, చిన్నారెడ్డి, జైపాల్‌నాయక్, అశోక్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, జంగయ్య, నర్సింహ, జంగయ్య, సందీప్ రెడ్డి, అరవింద్, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు (కిలో.. రూల్లో) టమాటా లోకల్ రూ.15, వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 50, కాకరకాయ 32, బీరకాయ 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 17, క్యారెట్ 28, దొండకాయ 28, ఆలుగడ్డ రూ.33, ఉల్లిగడ్డ 19, గోకర 28, దోసకాయ రూ.15, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 35, మునగ 23, చిలగడదుంప రూ.70, బీట్‌రూట్ రూ.21, కీర 23, ఫ్రెంచ్‌బీన్స్ రూ.75, కాప్సికమ్ 45గా ఉన్నాయి. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పోస్టర్ ఆవిష్కరణ

దిల్‌సుఖ్‌నగర్: సనాతన హైందవ ధర్మం అందించిన యజ్ఞాలు, హోమాలు సకల జనుల శుభం కోసమేనని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి, శైవ క్షేత్ర వనిత శక్తి సంస్థ ఆధ్వర్యంలో జూన్ 14న 'ఏకాహ్నిక దీక్ష పూర్వక చతుర్వేద దుర్గా సప్తశతి పూర్వక అష్టోత్తర హోమ గుండాత్మక చండీ హవనము' నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్‌కేపురంలో ఈ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను వకుళాభరణం చేతుల మీదుగా విడుదల చేశారు. వనిత శక్తి మేనేజింగ్ డైరెక్టర్ హైమ, పీఠం మేనేజర్ కోటేశ్వరావు, ధర్మో రక్షతి రక్షితః ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎల్.వీ.కుమార్ పాల్గొన్నారు.

ఆరుబయట చెత్త వేస్తే చర్యలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో వరుసగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపడుతున్నట్లు కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం 15వ వార్డులోని జెఎస్ యూఆర్‌ఎం కాలనీలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు 30 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కాలనీవాసులతో మాట్లాడుతూ.. చెత్తను ఆరుబయట వేయవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. దోమల నివారణ ఫాగింగ్ చేపడుతున్నామని తెలిపారు.

మలేరియా నివారణకు అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో ఎంటమాలజీ సిబ్బంది

చంపాపేట: మలేరియా రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామని దీనికి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యపడుతుందని సర్కిల్ ఎంటమాలజీ ఏఈ మణి అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా చంపాపేట డివిజన్ పరిధిలోని మారుతీనగర్, కర్మన్‌ఘాట్, ఉదయ్‌నగర్ కాలనీలలో దోమల నివారణ చర్యలపై ఎంటమాలజీ సిబ్బందితో కలసి ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ కుటుంబంలో వారంలో ఓరోజు పాత్రలు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండ పెంకుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తూ.. డ్రైడేను పాటించాలని కోరారు. ఎంటమాలజీ సిబ్బంది పెంటయ్య, శంకరప్ప, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి'



భాగ్యనగర్‌కాలనీలో కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని ప్రజలు గెలిపిస్తారని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను దాదాపుగా అన్నింటినీ అమలుచేశామని, చేసిన పనులకు తాము ఏ ప్రాంతాలకు వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

చైతన్యపురి: కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.శశిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జరిగిన బూత్ ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మల్కాజ్‌గిరి పార్లమెంటు అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి గెలుపునకు అందరూ పనిచేయాలన్నారు. గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి సమిష్టి కృషితోనే డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఓట్లు వచ్చేలా చూడాలన్నారు. నాయకులు వెంకటేష్‌చారి, విజయ్, కౌశిక్, భాస్కర్, వినోద్‌కుమార్, జితేందర్, రాంరెడ్డి, యాదయ్య, శంకర్, చరణ్, వెంకన్ననాయక్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎండల్లో.. హాయ్ హాయ్

- కళకళలాడుతున్న స్విమ్మింగ్ పూల్స్
- చిన్నారులతో కలిసి సేదతీరుతున్న పెద్దలు



చంపాపేట జేఎస్ఆర్ స్విమ్మింగ్‌పూల్‌లో చిన్నారుల సందడి

సైదాబాద్: విద్యార్థులందరికీ వార్షిక పరీక్షలు ముగియడంతో పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరమంతా చదువులు, పరీక్షలతో ఉక్కిరిబిక్కిరైన చిన్నారులు సెలవులు ప్రారంభం కాగానే.. సందడి చేసేందుకు స్విమ్మింగ్ పూళ్ల బాట పట్టారు.

- మండుతున్న ఎండలకు ఈత కొలనుల్లో ఆటలే హాయిగా ఉన్నాయంటూ.. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉపశమనం పొందుతున్నారు.
- కళ్లకు రక్షణగా అద్దాలు, తలకు ప్లాస్టిక్ కవర్లు పెట్టుకుని నీళ్లల్లో ఆటలతో మురిసిపోయే చిన్నారులతో స్విమ్మింగ్ పూల్స్ కళకళలాడుతున్నాయి.
- కొందరు చిన్నారుల్లో భయాన్ని పోగొట్టేందుకు పెద్దలు కూడా ఈత కొలనుల్లో దిగి పిల్లలతో కలిసి నీటి ఆటలను ఆస్వాదిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- సెలవుల సమయాన్ని ఉల్లాసంగా గడిపేందుకు స్విమ్మింగ్‌పూల్స్‌కు వెళ్లే చిన్నారులు తప్పనిసరిగా పలు జాగ్రత్తలు పాటించాలి.
- ఈత కొలనుల్లో లోతు ఎక్కువ, తక్కువ ఉండే ప్రాంతాలు ఉంటాయి. ఈతరాని చిన్నారులు, పెద్దలు కూడా లోతు ఎక్కువ ఉండే ప్రాంతం వైపు వెళ్లకూడదు.
- కొత్తగా ఈత నేర్చుకునేవారు, ట్యూబ్‌లతో ఈత నేర్చుకునే వారు కూడా లోతువైపు వెళ్లకూడదు.

స్విమ్మింగ్ కోచ్ పర్యవేక్షణలోనే ఆయన సూచనల మేరకు ఈత నేర్చుకోవాలి.

- సెలవుల్లో రోజు ఈతకొలనులకు వెళ్లే చిన్నారులు కళ్లకు అద్దాలు, తలకు కవర్, చెవుల్లో నీరు పోకుండా అవసరమైన పరికరాలను ఉపయోగించాలి.

కొలనుల్లో ఉల్లాసంగా నీటి ఆటలు...

- అన్ని స్విమ్మింగ్‌పూళ్లలో ఈతరాని చిన్నారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. కొలనుల్లోనే వారి కోసం లోతు తక్కువ ఉండే ప్రాంతాలను ఏర్పాటు చేస్తారు. పిల్లలు కూడా తమ ఎత్తును బట్టి అక్కడ ఉండే తక్కువ లోతు ప్రాంతాల్లో సహచరులతో కలిసి ఆటలు ఆడుతుంటారు. ఈత వచ్చిన వారు కొలనులో లోతు ఎక్కువ ఉండేచోట పలు రకాల పద్ధతుల ఈతల్లో తమలో తాము పోటీలు పెట్టుకుని ఉల్లాసంగా గడుపుతారు.

నీళ్లల్లో పిల్లలు.. గట్టుపై తల్లులు...

తమ చిన్నారులు కొలనుల్లోని నీటిలో కేరింతలు కొడుతుంటుంటే వారి తల్లులు గట్టుపై కూర్చొని వారిని చూస్తూ.. ఆనందాన్ని పొందుతుంటారు. నీళ్లల్లో వారి సంబరాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తూ.. తల్లులు మురిసిపోతున్నారు. నీటిలో వారి ఆటలు చూస్తూ.. వారికి జాగ్రత్తలు చెబుతూ.. తల్లులు కూడా ఎంతో ఉత్సాహంగా గడపడం ప్రస్తుతం ప్రతీ స్విమ్మింగ్‌పూల్‌లో కనపడుతుంది.

పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలి...

- సాధారణ రోజుల్లో కంటే వేసవి సెలవుల్లో ఎక్కువ మంది చిన్నారులు కొలనుల్లోకి దిగుతుంటారు. అనుకోని సంఘటనలు జరగకుండా పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలి. అందరిపై పర్యవేక్షణ ఉంచడం కోసం వేసవిలో అదనపు కోచ్‌లు, సహాయక సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి. కొలనుల్లో ఉన్న చిన్నారులందరి కదలికలపై సిబ్బంది పర్యవేక్షిస్తుండాలి.

ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కావు

- జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్

కడ్తాల్: పరీక్షల్లో ఫెయిల్ అయినంత మాత్రాన ఆత్మహత్యలు పరిష్కారం కావని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన సోమరాజు పాండు, పుష్ప దంపతులు కొన్నేళ్లుగా తమ పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ చదివిస్తున్నారు. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో పాండు కుమారుడు ఉదయ్‌కిరణ్(17) ఇంటర్ ఫస్టియర్‌లో ఒక్క సబ్జెక్‌లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని స్వగ్రామం రావిచేడ్‌కు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ గ్రామానికి చేరుకుని ఉదయ్‌కిరణ్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత దంపతులకు ఉన్న ఒక్క కుమారుడు ఇలా ఆత్మహత్య చేసుకోవడం పట్ల గ్రామస్తులు కన్నీటి పర్యాంతమయ్యారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, రైతుబంధు మండల కోఆర్డీనేటర్ వీరయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మాజీ సర్పంచ్ భారతమ్మ తదతరులు ఉన్నారు.

ఆడ బిడ్డ వివాహానికి చేయూత

కడ్తాల్: పేదింటి ఆడ బిడ్డ వివాహానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. మండల పరిధిలోని కానుగుబావితండాలో నేనావాత్‌సుగుణ, భీమా దంపతుల కూమార్తె మాన్విక వివాహం శుక్రవారం జరిగింది. ఈ మేరకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ వివాహానికి రూ.21 వేల ఆర్థికసాయంతో పాటు, పెళ్లి కూతురుకు పట్టు చీరను సైతం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్‌ఎంపీపీ ఆనంద్‌కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు తులసీరాం, హరిచంద్, శ్వేత, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, శారధ, పాండు, బీమన్, లక్ష్మణ్, రమేశ్, శ్రీను, రాజేశ్, బిక్కు, జగన్ తదితరులు ఉన్నారు.